క్లుప్తంగా

13న తెలంగాణ మహిళా దినోత్సవం



ఎమ్మెల్యే హరిప్రియను ఆహ్వానిస్తున్న సబిత

ఇల్లెందు: ఈనెల 13న తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి సబిత ఎమ్మెల్యే హరిప్రియను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి మార్కెట్‌యార్డులో తగు ఏర్పాట్లు చేయాలని స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట సీడీపీఓ లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్లు జ్యోతి, కొమ రమ్మ, ఈఓ హసీనా ఉన్నారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఏరియా జీఎం రమేష్

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ దశమ ఆవిర్భావ వేడుకలకు సింగరేణి తరఫున ఏర్పాట్లు పూర్తిచేశామని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ తెలిపారు. కొత్తగూడెంలో కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. వేడుకలను ఈనెల 2న రుద్రంపూర్‌లో, 5న సతుపల్లిలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నామని వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగుల సన్మానంతోపాటు, కార్పొరేట్ కళాశాలలో వివిధ కోర్సుల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, గృహనిర్మాణానికి వడ్డీ చెక్కులు, డిపెండెంట్ ఉద్యోగులకు నియమాక పత్రాలు అందజేస్తామని తెలిపారు. అధికారులు కోటిరెడ్డి, రఘురామిరెడ్డి, సామ్యూల్ సుధాకర్, యోహాన్, రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకండి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం 2023– 24 విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సర ప్రవేశాలకు టీజీ యూజీ సెట్ పరీక్ష ద్వారా మొదటి దఫాలో ఎంపికైన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం అయిందని, వారం రోజులు జరుగుతుందని, విద్యార్థినులు తమ అర్హత పత్రాలు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు ఆన్‌లైన్ చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారం నిర్వహిస్తున్న వారు వారి దుకాణం కొలతల ప్రకారం ట్రేడ్ లైసెన్స్‌లు ఆన్‌లైన్ రిజిస్టరు చేసుకొని సర్టిఫికెట్ పొందాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలను వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకొని, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను ఫోన్ పే ద్వారా చెల్లించవచ్చని తెలిపారు.

సమ్మె విరమణ

సింగరేణి(కొత్తగూడెం): 45 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు ఐకేపీ వీఓఏ జిల్లా ప్రతినిధి బృందం కలెక్టర్ అనుదీప్‌కు లేఖ ద్వారా విన్నవించారు. గురువారం ఆయన చాంబర్‌లో కలిసి వీఓఏల సమస్యలను వివరించారు. స్పందించిన కలెక్టర్ సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, రేష్మ, సుజాత ఉన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: మండల పరిషత్తు కార్యాలయంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చింది. మండలంలోని పలు గ్రామాల నుంచి 40 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాలో ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రథమ్ ఎడ్యుకుషన్ ఫౌండేషన్ నింగు శ్రీహరి మాట్లాడుతూ.. ఇంటర్వ్యూకు హాజరైనవారిలో ప్రతిభ కనబర్చిన 25 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిర్ణయించామని చెప్పారు. వీరికి ఈ నెల 6వ తేదీ నుంచి శిక్షణ శిబిరం నిర్వహించి అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రథమ్ ఎడ్యుకుషన్ ఫౌండేషన్ ఇల్లెందు ఏరియా ప్రతినిధి తాటి మల్లయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకల సంబురం

- విద్యుద్దీపాలతో అలంకరణలు
- ముఖ్యఅతిథులచే పలు కార్యక్రమాల నిర్వహణ



ఇల్లెందు: మెయిన్‌రోడ్‌లో సెంట్రల్ లైటింగ్

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ దశాబ్ది ఆవిర్భావ వేడుకలకు సింగరేణి సిద్ధమైంది. ఈ సందర్భంగా కార్పొరేట్, ఏరియా పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్ వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. కార్యాలయాల్లో మామిడి, అరటి తోరణాలు కట్టి, షామియానాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. సెంట్రల్ ఫంక్షన్ నిర్వహించే ప్రకాశం స్టేడియంలో సంస్థ 10 సంవత్సరాలలో సాధించిన అభివృద్ధిపై ఫ్లెక్సీల రూపంలో స్టాల్స్‌ను రూపొందించింది. ముఖ్యఅతిథులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే వేదికలను ఏర్పాటు చేశారు.

టేకులపల్లి: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించనున్న వేడుకల నేపథ్యంలో గురువారం రాత్రి మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీఓ, బొమ్మనపల్లి విద్యుత్ కార్యాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేశారు. గురువారం రాత్రి స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని, జలవనరుల కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

జూలూరుపాడు: శుక్రవారం రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను జరుపుకునేందుకు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. తహసీల్, ఎంపీడీఓ, పోలీసుస్టేషన్, ఫారెస్ట్ రేంజ్, విద్యుత్ సబ్ స్టేషన్, రైతు వేదికలను అలంకరించారు. అన్ని ప్రభుత్వ, గ్రామపంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో జెండా ఎగరవేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇల్లెందు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సంబురాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌తో సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఉదయం 8గంటలకు జెండా ఎగుర వేసి ఉత్సవాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. మెయిన్‌రోడ్, డివైడర్, సెంట్రల్ లైటింగ్, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఉత్సవాలలో ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, కమిషనర్ అంకుషావలీ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, ఇతర శాఖల అధికారులు పాల్గొననున్నారు.



జూలూరుపాడు: పోలీస్ స్టేషన్



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్యాలయం



టేకులపల్లి: విద్యుత్ శాఖ కార్యాలయం



పాల్వంచరూరల్: ఎంపీడీఓ కార్యాలయం



పాల్వంచ: కేటీపీఎస్ సీఈ కార్యాలయం

మంచినీళ్ల పండుగను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఈ సదాశివకుమార్

పాల్వంచ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 18న మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించాలని మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్ అన్నారు. గురువారం తొగ్గూడెంలోని మిషన్ భగీరథ గ్రిడ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాలు, గ్రామాల్లో వేడుకలు నిర్వహించాలన్నారు.

నాడు మంచినీళ్ల కోసం అనేక కష్టాలు పడ్డామని, నేడు మిషన్ భగీరథతో గ్రామాల్లో మంచినీటి కష్టాలు తీరాయని వాటిని ప్రజలకు వివరించాలన్నారు. సంబురాల్లో గ్రామస్తులంతా పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఈ నళిని, ఈఈ తిరుమలేశ్, డీఈలు, ఓఅండ్ఎం సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కందుల దినేష్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం చుక్కాలబోడు పంచాయతీ జేత్యాతండాలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 46 మందికి రక్త పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించి అవసరమైన మందులు అందించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా గంగ, కార్యదర్శి కార్తీక్, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, వీసం శకుంతల, ఏఎన్ఎంలు రమాకుమారి, వెంకటరమణ, దనసరి రాంబాబు, ఆశా కార్యకర్తలు జ్యోతి నిర్మల, కళావతి, సునీత, శారద, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

జూలూరుపాడు: ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాపకొల్లు గ్రామంలో ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఉపాధి కూలీలు పని చేసే ప్రాంతాల్లో నిల్వ నీడ లేక అల్లాడి పోతున్నారన్నారు. పని ప్రాంతాల్లో టెంట్, మెడికల్ కిట్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. మండుటెండలో పని చేస్తే రూ.60 ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు రోజు వారీ కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవడానికి పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో యాసా నరేష్, ఊడల వెంకటేశ్వర్లు, లాలయ్య, కూలీలు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లుగా ప్రజావ్యతిరేక పాలన

ఇల్లెందురూరల్: ఇల్లెందు నియోజకవర్గంలో మరోసారి కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు చీమల వెంకటేశ్వర్లు అన్నారు. ముత్తారపుకట్ట గ్రామపంచాయతీ పరిధిలో పలు కుటుంబాలు బీఆర్ఎస్, న్యూడెమోక్రసీల నుంచి గురువారం కాంగ్రెస్‌లో చేరాయి. వారికి ఆయన కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో గడిచిన తొమ్మిదేళ్లుగా ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతోందని ఆరోపించారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న సీఎం కేసీఆర్ ధరణి ద్వారా లక్షల ఎకరాలను రైతులకు దూరం చేసి భూస్వాములకు కట్టబెట్టారని విమర్శించారు. వ్యవసాయంలో రైతులకు తోడ్పాటునందించే పలు సబ్సిడీ పథకాలను రద్దు చేసి అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. రైతును రాజు చేయాలనే సంకల్పంతో, యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ అగ్ర నేతలు ప్రకటించిన డిక్లరేషన్‌లు ప్రజలకు చేరువయ్యాయని గుర్తుచేశారు. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం చూడాలన్న నిర్ణయం ప్రజల్లో ఏర్పడినందునే కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్నాయని చెప్పారు. వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఊకే నాగయ్య, కుంజ నరేష్, ఇర్ప కృష్ణ, పొడుగు సజ్జయ్య, కల్తి ప్రకాష్, మోకాళ్ల వీరస్వామి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పులి సైదులు, ధనసరి స్రవంతి, సామ్రాట్, ఎట్టి హరికృష్ణ, వల్లాల రాజయ్య, అరెం కిరణ్, ధనసరి రాజు, పూనెం మధు,తులశ్యా, ధన్‌సింగ్, తాళ్లపల్లి ఈశ్వర్, జీవీభద్రం తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చీమల వెంకటేశ్వర్లు

నేడు వేలంపాట

పాల్వంచ: శ్రీ కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో షాపులు, చీరలు పోగు చేసుకునేందుకు లైసెన్స్ హక్కుల కోసం శుక్రవారం ఉదయం 10గంటల నుంచి టెండర్లు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి రజిని కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయ కార్యాలయంలో రూ.200 చెల్లించి షెడ్యూల్ పొందవచ్చని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులపై ఎందుకీ వివక్ష?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి తరఫున తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ కాంట్రాక్ట్ కార్మికులను విస్మరించడం సరికాదని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న పేర్కొన్నారు. అన్ని పనుల్లో ముందు నిలిచే కార్మికులకు కనీసం స్వీట్ ప్యాకెట్ ఇవ్వలేమని చెప్పడం గర్హనీయమని తెలిపారు. ఇకనైనా కాంట్రాక్ట్ కార్మికులపై వివక్ష విడాలని గురువారం ఆయన ఓ ప్రకటనలో కోరారు.

ప్రజాపంథాలో చేరిక

సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీకి చెందిన పెద్దబోయిన సతీష్, ఎం.చంద్రశేఖర్ ఆ పార్టీకి రాజీనామా చేసి గురువారం ప్రజాపంథాలో చేరారు. ఈ సందర్భంగా వారిని నాయకులు మాచర్ల సత్యం, జాతోత్ కృష్ణ ఆహ్వానించగా, మధుసూదన్‌రెడ్డి, యాకూబ్ షావలీ, ఏదులాపురం గోపాలరావు, బానోత్ ధర్మా, పాయం వెంకన్న, రాజశేఖర్, జగ్గన్న, పాపన్న పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

టేకులపల్లి: 108 అంబులెన్స్‌లో గురువారం ఓ మహిళ ప్రసవించింది. మేళ్లమడుగు గ్రామానికి చెందిన సనప మమతకు పురిటి నొప్పులు రావడంతో టేకులపల్లి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వైద్యాధికారి శ్రీకాంత్ సలహా మేరకు ఈఎంటీ విజయలక్ష్మి, పైలట్ కేవీ రామారావు సహాయంతో మమతకు డెలివరీ చేశారు. మగ బిడ్డ జన్మించింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించామని 108 సిబ్బంది తెలిపారు.

సేవా సమితి భాగస్వామ్యం పెంచాలి

ఇల్లెందు: సింగరేణి నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో సేవా సమితి భాగస్వామ్యం పెంచాలని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు జి.మధురవాణి కోరారు. గురువారం ఇల్లెందులోని సమితి కార్యాలయంలో సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 5న సింగరేణి గ్రౌండ్‌లో ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతాయని, పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరయ్యేలా చూడాలని కోరారు.

మహిళ అదృశ్యంపై కేసు

ఇల్లెందు: వేములవాడ గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఘనీ తెలిపారు. వేములవాడకు చెందిన పూనెం విజయరాణి మూడు రోజులుగా కానరాకపోవడంతో ఆమె తండ్రి కృష్ణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బడిబాటను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న హెచ్ఎం జ్యోతిరాణి

కొత్తగూడెంరూరల్: ఈనెల 3వ తేదీ నుంచి 17 వరకు మన ఊరు మనబడిలో భాగంగా నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో ప్రతి తల్లిదండ్రులు అర్హులైన తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హెచ్ఎం ఎం.జ్యోతిరాణి కోరారు. లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీ గ్రామపంచాయతీ ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం జయశంకర్ బడిబాట సన్నాహక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం తయారు చేస్తోందని, అన్ని మౌలిక వసతులతోపాటు ఇంగ్లిష్ మీడియం తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, రెండు జతల యూనిఫాం, అధునాతన బల్లలు, సన్న బియ్యంతో పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. సమావేశంలో ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, ఏఎస్ఎం శాంతిప్రియ, ఎస్ఎంసీ సభ్యులు సుశాంత్, సునంద, కల్యాణి, మణెమ్మ, స్వప్న, శ్రీలత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు దీక్షా దివస్ నిర్వహిద్దాం..



మాట్లాడుతున్న రంగారెడ్డి

ఇల్లెందురూరల్: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేళ్లు అయినా ప్రజల కలలు కలలుగానే మిగిలిపోయాయని, ఈ కారణంగా జూన్ 2న ప్రజల ఆకాంక్షలు నెరవేరని దీక్షా దివస్‌గా నిర్వహించాలని ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కెచ్చెల రంగారెడ్డి, రాయల చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. కొమరారంలో గురువారం ఏర్పాటైన ప్రజాపంథా ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కోటి ఆశలతో సకల జనులు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షతో ఉద్యమించారని గుర్తుచేశారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు ఆయనకు పట్టం కట్టారని చెప్పారు. కానీ నేటికీ నోటిఫికేషన్లు ఇవ్వలేదని, ఇచ్చిన వాటికి ప్రశ్నపత్రాల లీకేజీతో యువతను మోసం చేశారని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితిలో ఉత్సవాలు ఎందుకు నిర్వహించాలని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ నియంతృత్వ పోకడలను నిలువరించేందుకు ప్రజాపోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయిని రాజు, ఆజ్మీర బిచ్చా, శంకర్, చారి, బోసు, యాకూబ్‌షావళి, బుర్ర వెంకన్న, రాఘవులు, శాంతయ్య, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న ఎండీ రజాక్

సింగరేణి(కొత్తగూడెం): గత ఏప్రిల్ 18, 19 తేదీలలో కోల్‌కత్తాలో జరిగిన 11వ వేజ్‌బోర్డ్ 10వ సమావేశంలో జాతీయ కార్మిక సంఘాలు చేసుకున్న ఒప్పందం కార్మికులకు నష్టం అని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తెలిపారు. గురువారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే-5షాఫ్ట్ గని ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 10వ వేజ్‌బోర్డ్‌లో 24శాతం ఎంజీబీ, 49శాతం అలవెన్స్‌లపై ఒప్పందం చేసుకోగా, ఈసారి 5శాతం ఎంజీబీతోపాటు 24 శాతం అలవెన్స్‌ల తగ్గుదలే కాకుండా యూజీ అలవెన్స్, స్పెషల్ అలవెన్స్, హెచ్ఆర్ఏ అలవెన్స్‌లు ఫ్రీజింగ్ చేసి, జాతీయ కార్మిక సంఘాల కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. అంతేకాకుండా ఇంక్రిమెంట్ రేటును పెన్షన్ లీవ్, గ్రాట్యుటీ, సీపీఆర్ఎంఎస్, హెల్త్ కార్డ్ పరిమితిని పెంచకుండా అగ్రిమెంట్ చేయటం ఎంత వరకు సమంజసమని, కార్మికులకు ఇన్ని రకాల అన్యాయం చేసిన సంఘాలు తాము మెరుగైన ఒప్పందం చేశామని డప్పు కొట్టుకోవటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రీజియన్ కార్యదర్శి కూసన వీరభద్రం, 11మెన్ కమిటీ సభ్యులు కాపు కృష్ణ, చిలక రాజయ్య, బూటుక రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, ప్రభాకర్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బారి నుంచి రక్షించండి



కుక్కల దాడిలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): వీధి కుక్కల బారి నుంచి ప్రజలను కాపాడాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై.శ్రీనివాసరెడ్డి, సీపీఎం కొత్తగూడెం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు, డి.వీరన్న కొత్తగూడెం మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. లెనిన్‌నగర్‌లో ఈ మధ్యకాలంలో ఒక్కరోజే 11 మందిపై వీధి కుక్కలు దాడిచేశాయి. గాయపడిన వారిని గురువారం ఆయన పరామర్శించారు. మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో కోతులు, కుక్కలు, పందులకు స్వైర విహారం చేస్తున్నాయని, బాధితులు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించాల్సిన అధికారులు నోరుమెదపటం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పట్టణంలో కోతులు, కుక్కల సంచారం పెరిగిందని వాటిని నివారించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో కుక్కల బారీ నుంచి ప్రజలను కాపాడాలని లేదంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నిస్వార్థ ప్రజాసేవకుడు భీంజీ



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేసిన వాంకుడోత్ భీంజీ నిస్వార్థ ప్రజాసేవకుడిగా ప్రజల మన్ననలు పొందారని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. మండలంలోని పోచారంతండా గ్రామపంచాయతీ అమర్‌సింగ్‌తండా గ్రామంలో భీంజీ విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో మధు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధిగా, విప్లవకారుడిగా నిరంతరం ప్రజల కోసమే పనిచేయడంతోపాటు ఆదర్శ రైతుగా ఏజెన్సీ రైతంగానికి మార్గదర్శిగా నిలిచాడన్నారు. కూరగాయల సాగును ఈ ప్రాంతంలో విరివిగా చేపట్టి కూరగాయల కేంద్రంగా మారేలా రైతులను ప్రోత్సహించారని గుర్తుచేశారు. భీంజీ ప్రస్తుతం భౌతికంగా మన మధ్య లేకున్నా ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మోకాళ్ల కృష్ణ, బానోత్ సంతు, వాంకుడోత్ శ్రీను, వాంకుడోత్ సరోజిని, కందగట్ల సురేందర్, సారంగపాణి, మూడు మాలు, లక్ష్మీనారాయణ, జటంగి వెంకన్న, శ్రీను, హరియా పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి



కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు

చుంచుపల్లి: ఆదివాసీ గిరిజనుడైన జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్యను చులకనభావంతో దిష్టిబొమ్మ దహనం చేసి అవమానించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశాక ఆదివాసీ ఐక్య రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణదొర మాట్లాడుతూ.. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యను కొందరు అసాంఘిక శక్తులు ఓర్వలేక ఆయన పదవిని అపహాస్యం చేస్తూ వ్యక్తిగత ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పదవిలో ఉన్న జెడ్పీ చైర్మన్ దిష్టిబొమ్మను దహనం చేసి ఆదివాసీ ప్రజల మనోభావాలు, ఆత్మగౌరవం దెబ్బతినేలా చేసిన వ్యక్తులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జెడ్పీ చైర్మన్‌కు వ్యతిరేకంగా ధర్నాలో పాల్గొన్న వారిపై పోలీసులు తక్షణమే కేసులు నమోదు చేయాలని 1వ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పూనెం బాలకృష్ణ, కుంజాదుర్గ, పూనెం సురేందర్, కారం సీతారాములు, వాసు, అంజిబాబు, తాటి బాలకృష్ణ, కుంజా సత్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.